సాక్షి అనంతపురం

శనివారం । 11 । నవంబర్ । 2023



13న 'స్పందన' ఉండదు

దీపావళిని పురస్కరించుకుని ఈ నెల 13న ప్రభుత్వం సెలవు ప్రకటించినందున ఆ రోజున 'స్పందన' ఉండదని డీఆర్‌ఓ తెలిపారు.



సీహెచ్‌సీల్లోనూ గుండెకు చికిత్స

గుండె జబ్బున్న వారికి సీహెచ్‌సీల్లోనే వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

IIలో

గరిష్టం/కనిష్టం

35.6°/20.6°

అనంతపురం జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

దీపావళికి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: దీపావళి పండగ సందర్భంగా శనివారం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా బీదర్–యశ్వంత్‌పూర్ మధ్య స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ జంక్షన్ నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు (06506) బయలుదేరి 12వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (06507) 13న రాత్రి 11.15 గంటలకు యశ్వంత్‌పూర్ జంక్షన్ నుంచి బయలుదేరి 14న మధ్యాహ్నం 12.15 గంటలకు బీదర్ జంక్షన్ చేరుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ జంక్షన్ నుంచి రైలు (06508) బయల్దేరి యశ్వంత్‌పూర్ జంక్షన్‌కు 15వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అహుడా చైర్మన్‌గా మహాలక్ష్మి కొనసాగింపు



అనంతపురం కార్పొరేషన్: అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) చైర్మన్‌గా మహాలక్ష్మి శ్రీనివాస్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2021లో అహుడా చైర్మన్‌గా మహాలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం మరోసారి ఆయన్ను కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు మహాలక్ష్మి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆ పదవికి న్యాయం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 18 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో అహుడా ముందంజలో ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ధర్మవరంలో 124 ఎకరాల్లో, రాప్తాడు మండలం రామినేపల్లి వద్ద 80 ఎకరాలు, కొడికొండ చెక్‌పోస్టు వద్ద 7.20 ఎకరాలు, పెనుకొండలో 28 ఎకరాలు, కూడేరులో 26 ఎకరాలు, గుత్తిలో 11.26 ఎకరాల్లో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అహుడాను ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

ఎస్కేయూ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పదవీ కాలం ఈ నెల 23తో ముగియనుంది. ఈ నేపథ్యంలో నూతన వీసీ నియామం కోసం సెర్చ్ కమిటీని రాష్ట్ర ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలరావును నియమించారు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ ముగ్గురు మూడు పేర్లను ప్రతిపాదిస్తారు. ఇందులో ఒకరిని వీసీగా ఛాన్సలర్/ గవర్నర్ నియామకం చేస్తారు. సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ నామినీగా ప్రొఫెసర్ డి.జమున (మాజీ వీసీ, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ, తిరుపతి), యూనివర్సిటీ పాలకమండలి నామినీగా ప్రొఫెసర్ డి.ఎన్.రెడ్డి (మాజీ వీసీ, జేఎన్‌టీయూ, హైదరాబాద్, తెలంగాణ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నామినీగా ప్రొఫెసర్ సారిత్ కుమార్ దాస్ (వి.బాలకృష్ణన్ చైర్ ప్రొఫెసర్, మెకానికల్ ఇంజినీరింగ్, మద్రాస్ ఐఐటీ)లను నియమించారు. త్వరలోనే సెర్చ్ కమిటీ సమావేశమై దరఖాస్తులన్నింటినీ పరిశీలించి మూడు పేర్లను ప్రతిపాదించనున్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

అనంతపురం ఎడ్యుకేషన్: సెలవుల్లో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో వరుసగా ప్రభుత్వం సెలవులు ప్రకటించిందన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలు కచ్చితంగా సెలవులు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే మాత్రం చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దర్జాగా పచ్చనేత భూ కబ్జా

- 3.79 ఎకరాల బంజరు భూమిలో పాగా
- అధికారుల సర్వేలో బట్టబయలు



టీడీపీ నేత చిన్నపొలమడ వద్ద కబ్జా చేసిన స్థలంలో చేపట్టిన నిర్మాణాలు

తాడిపత్రి: తెలుగుదేశం హయాంలో రూ.కోట్లు విలువ చేసే బంజరు భూములను ఆ పార్టీ నేత ఒకరు కబ్జా చేశారు. కొందరు అధికారులు లోపాయికారిగా ఆ నేతకు సహకరించినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే... తాడిపత్రి మండలం చిన్నపొలమడ పంచాయితీ పరిధిలో సర్వే నంబర్ 411 ఏ1ఏలో 1.79 ఎకరాలు, 411 ఏ1బిలో 1.66 ఎకరాలు, 411 ఏ3లో 34 సెంట్లు మొత్తం 3.79 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. తాడిపత్రి – పెద్దపప్పూరు ప్రధాన రహదారిలో గల ఈ భూమిని వైఎస్సార్ జిల్లా సిద్దవటం ప్రాంతానికి చెందిన ఓ టీడీపీ నేత కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. అందులో గ్రానైట్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

అధికారుల సర్వేతో వెలుగులోకి..

ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణానికి చిన్నపొలమడ పంచాయతీ పరిధిలో బంజరు భూములు ఏ మేరకు ఉన్నాయో సర్వే చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 2020లో అధికారులకు లేఖ రాశారు. దీంతో జిల్లా సర్వే అధికారులు చిన్నపొలమడ పంచాయతీ పరిధిలోని అసైన్డ్ భూములను సర్వే చేయగా సదరు 'పచ్చ'నేత 3.79 ఎకరాలు ఆక్రమించినట్లు గుర్తించారు. ఇదే కాకుండా ఈ పంచాయితీ పరిధిలో దాదాపు 40 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు అప్పట్లో గుర్తించారు. భూ కబ్జాపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి కలెక్టర్ గౌతమికి ఫిర్యాదు చేశారు. పేదలకు, ప్రభుత్వానికి చెందాల్సిన విలువైన భూమిని కాపాడి అందులో ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించాలని ఈ ఏడాది ఆగస్టు 10న కలెక్టర్‌కు లేఖ రాశారు. 411 సర్వే నంబర్‌లోని 3.79 ఎకరాల్లోని భూమిని భూగర్భ గనుల శాఖ, ఐసీడీఎస్, కార్మికశాఖ కార్యాలయాల భవనాలకు కేటాయించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఆక్రమణలను తొలగించి సమగ్ర నివేదిక పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఆదేశాలు బేఖాతరు

కలెక్టర్ ఆదేశాలను రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కారు. 411 సర్వే నంబర్‌లోని ఆక్రమణలను ఇంతవరకు తొలగించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారితో పాటు తాడిపత్రికి చెందిన రెవెన్యూ అధికారి కూడా సదరు 'పచ్చ' నేత సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆదేశాలను బేఖాతరు చేసినట్లు తెలిసింది.

బంజరు భూములు పేదలకు దక్కాలి



సెంటు స్థలం లేని నిరుపేదలు తాడిపత్రిలో చాలా మంది ఉన్నారు. బంజరు భూములను గుర్తించి వాటిలో పేదలకు ఇళ్ల పట్టాలను ఇవ్వాలన్నదే నా కోరిక. బంజరు భూముల్లోని ప్రతి సెంటూ నిరుపేదలకే దక్కాలి. ఇళ్లు లేని నిరుపేదలు ఉండకూడదన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. కబ్జాదారుల నుంచి బంజరు భూములను కాపాడుతాం.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే

చర్యలు తీసుకుంటాం



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగు రోజులవుతోంది. చిన్నపొలమడ పంచాయతీ పరిధిలోని బంజరు భూములు ఆక్రమించుకున్నారన్న విషయం నా దృష్టికి ఇంకా రాలేదు. బంజరు భూముల వివరాలను ఆర్ఐ, సర్వేయర్ల ద్వారా పూర్తి స్థాయిలో తెలుసుకుని కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– అలెగ్జాండర్, తహసీల్దార్, తాడిపత్రి

చోరీల నియంత్రణకు కృషి



ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: చోరీల నియంత్రణకు కృషి చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దర్యాప్తు దశలో ఉన్న ప్రాపర్టీ అఫెన్స్ కేసులపై ఆరా తీశారు. చోరీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ముందస్తు చర్యలు చేపట్టి చోరీలు జరగకుండా చూడాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు పక్కాగా అమలు చేయాలన్నారు.

కొప్పలకొండ వెల్‌నెస్ సెంటర్‌కు క్వాలిటీ సర్టిఫికెట్

గార్లదిన్నె: కొప్పలకొండలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు కేంద్ర నాణ్యతా సేవల ప్రమాణాల కమిటీ క్వాలిటీ సర్టిఫికెట్ మంజూరు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి శుక్రవారం తెలిపారు. సెప్టెంబర్ 20న కేంద్ర నాణ్యతా ప్రమాణాల కమిటీ కొప్పలకొండలో పర్యటించి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో ల్యాబ్, సేవల రికార్డులు, పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసిందన్నారు. అందులో భాగంగా వెల్‌నెస్ సెంటర్‌కు క్వాలిటీ సర్టిఫికెట్ మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్ర సిబ్బందిని పీహెచ్‌సీ డాక్టర్లు అభినందించారు.

జగన్‌మోహన్‌రెడ్డికి జనం జేజేలు



కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ఒంటిమిద్ది సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల బోర్డు ఆవిష్కరించిన మంత్రి ఉషశ్రీచరణ్



కొనకొండ్లలో బుక్‌లెట్ విడుదల చేస్తున్న ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

- ఏపీలో పాలన దేశానికే ఆదర్శం
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్
- జిల్లాలో ఊపందుకున్న 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనంతపురం కార్పొరేషన్: ఏపీలో సంక్షేమ విప్లవం సాగించిన జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జిల్లాలో ఊపందుకుంది. శుక్రవారం వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో చంద్రబాబు నయవంచక పాలన, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన గురించి తెలియజేశారు. జగన్ పాలనకు జనం జేజేలు పలుకుతూ 'ప్రజా తీర్పు' పుస్తకంలో అత్యధిక మార్కులిస్తామని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమం జరిగిన ప్రాంతంలో గ్రామ పెద్దలతో కలసి భోజనం చేశారు. స్థానిక సమస్యలు, పరిష్కార చర్యలపై చర్చించారు.

- కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని ఒంటిమిద్ది గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంత్రి ఉషశ్రీచరణ్ ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాల కన్నా ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, తదితరుల ఆర్థిక స్థితిగతులను సీఎం జగన్ మెరుగుపర్చారన్నారు.
- రాయదుర్గం నియోజకవర్గంలో గమ్మఘట్ట, 75 వీరాపురం, ఉడేగోళం, రాయదుర్గం పట్టణం కొలిమి వీధిలో జరిగిన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. గత చంద్రబాబు పాలనకు ప్రస్తుత జగన్ పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకెళ్లాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలన్నారు.
- ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా ఈ స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి గతంలో ఎవ్వరూ చేపట్టలేదన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం కల్లూరులో జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు సామాజిక, రాజకీయ, ఉపాధి తదితర వాటిలో న్యాయం జరగడానికి ప్రధాన కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక చర్యలేనన్నారు. ఆ సువర్ణపాలన కొనసాగాలంటే మరోమారు ఏపీ సీఎంగా జగన్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొన్నారు.
- అనంతపురం అర్బన్ ఎర్రనేలకొట్టాలలోని 2వ సచివాలయం, వినాయకనగర్‌లోని 3వ సచివాలయంలో జరిగిన కార్యక్రమాన్ని మేయర్ వసీం ప్రారంభించారు.

రేయ్.. మాపైనే నీళ్లు పోస్తావా!

- దళిత యువకుడిని చితకబాదిన పరిటాల శ్రీరామ్ అనుచరులు
- కులం పేరుతో దూషణలు
- ఆలస్యంగా వెలుగులోకి..

అనంతపురం/రాప్తాడురూరల్: అన్నం వడ్డించే క్రమంలో పొరబాటున నీళ్లు పడడంతో ఓ దళిత యువకుడిని పరిటాల శ్రీరామ్ అనుచరులు చితకబాదారు. ఈ నెల 7న అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి క్రాస్ సమీపంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం నగరానికి చెందిన దళిత శేఖర్ ఓ ప్రైవేట్ కంటి ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. ఆస్పత్రి యజమాని, అతడి స్నేహితులు ఈ నెల 7న బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు సమీపంలోని తోటలో విందు ఏర్పాటు చేసుకున్నారు. పరిటాల శ్రీరామ్ అనుచరులైన ఇటుకలపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్కులప్ప కుమారుడు అనిల్, మాల్యవంతం శీన, ముష్టూరు సాంబ, ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన ఎస్ఎంఎస్ రాజు హాజరయ్యారు. యజమాని సూచన మేరకు శేఖర్ ఏర్పాట్లలో పాల్గొన్నాడు. భోజనం వడ్డించే క్రమంలో శేఖర్ గ్లాసులో నీళ్లు పోస్తుండగా పొరపాటున శ్రీరామ్ అనుచరులపై పడ్డాయి. అక్కడే శేఖర్‌తో వాగ్వాదానికి దిగారు. అక్కడున్న వారు కల్పించుకుని సర్ది చెప్పారు. విందు ముగించుకుని రాత్రి 11 గంటల సమయంలో శేఖర్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి అనంతపురం నగరానికి బైకులో బయలుదేరారు. కృష్ణంరెడ్డిపల్లి క్రాస్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి పోలీస్ సైరన్‌తో బొలెరో వాహనంలో వచ్చి బైక్‌ను ఆపారు. వాహనం నుంచి కిందకు దిగిన అనిల్, మాల్యవంతం శీన, సాంబ, రాజు నలుగురూ కలిసి శేఖర్‌పై దాడికి పాల్పడ్డారు. 'పార్టీలో మా మీద నీళ్లు పోస్తావారా.. నా కొడకా! మేము ఎవరో తెలుసారా?' అంటూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు నిందితులు నలుగురిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



పట్టుబడ్డ మద్యం బాక్సులను చూపుతున్న అడిషనల్ ఎస్పీ రామకృష్ణ

రాయదుర్గం: జిల్లాలో గంజాయి, మద్యం, సారా అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపామని అడిషనల్ ఎస్పీ జి.రామకృష్ణ అన్నారు. గురువారం రాయదుర్గం సెబ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత పటిష్టం చేశామన్నారు. జిల్లాలో గడిచిన పది రోజుల్లో అక్రమ మద్యం రవాణా, అమ్మకాలకు సంబంధించి 53 కేసుల్లో 59 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం కేసుల్లో 11 వాహనాలు సీజ్ చేసినట్టు స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై 14 కేసులు నమోదు చేశామన్నారు. సారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు వాహన తనిఖీలు మరింత విస్తృతం చేస్తామన్నారు. వరుసగా రెండు లేదా ఆపై ఎక్కువసార్లు పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం రవాణాదారుల అరెస్టు

కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ముక్కాల తిమ్మప్ప, బాపనల్లి తిప్పేస్వామిలను రాయదుర్గంలోని మద్దానేశ్వర ఆలయ సమీపాన శుక్రవారం ఉదయం అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన రాయదుర్గం సెబ్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. వీరి నుంచి 1,056 టెట్రా ప్యాకెట్ల మద్యం, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం రవాణాదారులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సెబ్ ఎస్ఐ హరికృష్ణను అభినందించారు.

క్వారీ యజమానిపై హత్యాయత్నం

- డబ్బు విషయంలో గొడవ



గాయపడ్డ సుశీల్



నిందితుల కారు

అనంతపురం క్రైం: నగరంలో గ్రానైట్ క్వారీ యజమానిపై హత్యాయత్నం జరిగింది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూసింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం సాయినగర్‌లో నివాసముంటున్న సుశీల్‌కు బుక్కరాయసముద్రం, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, కదిరి ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. మూడు నెలల కిందట కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన నూర్ అనే వ్యక్తితో రాయిని కోసే మిషన్, ఇతర పరికరాలు అద్దెకు తీసుకుని, బుక్కరాయసముద్రంలోని క్వారీకి తీసుకొచ్చాడు. అయితే సెట్ చేసిన తర్వాత మిషన్ పనిచేయడం లేదని యజమానికి సమాచారం అందించాడు. వినియోగంలోకి తీసుకొచ్చిన రోజు నుంచి తాను అద్దె చెల్లిస్తానని స్పష్టం చేశాడు. అయితే నూర్ మిషన్ రిపేరీకి టెక్నీషియన్లను పంపించకపోగా.. నెలల తరబడి పరికరాలను క్వారీలోనే ఉంచాడు. ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం ఫోన్ చేసి లారీ తెచ్చి మిషన్‌ను తీసుకెళ్తామని నూర్ చెప్పాడు. తమకు మూడు నెలల అద్దె చెల్లించాల్సి ఉంటుందని, ఇవ్వకపోతే అంతు చూస్తామంటూ హుకుం జారీ చేశాడు. పనిచేయని మిషన్‌కు ఎలా అద్దె చెల్లిస్తామంటూ సుశీల్ ప్రశ్నించాడు. దీంతో నూర్ ఫోన్ పెట్టేసి కారులో తన అనుచరుడితో కలిసి అనంతపురంలోని సుశీల్ ఇంటికి చేరుకున్నాడు. వచ్చీ రాగానే సుశీల్ సోదరుడిపై దాడి చేసి, లోపలి నుంచి వచ్చిన సుశీల్‌పై కత్తి, ఇనుపరాడ్లతో విరుచుకుపడ్డారు. సుశీల్ తలకు తీవ్ర గాయమైంది. భయాందోళన గురైన సుశీల్ కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వస్తారన్న భయంతో నూర్ తన అనుచరులతో కలిసి కారులో ఉడాయించేందుకు ప్రయత్నించాడు. అలా వేగంగా వెళ్లే క్రమంలో ఆ వీధిలోని కాంపౌండ్‌ను ఢీకొట్టి.. కారు కల్వర్టులో ఇరుక్కుంది. ఈ ఘటనలో నూర్ అనుచరుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని నూర్‌తో పాటు అతని అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రగాయాల పాలైన సుశీల్‌ను కుటుంబ సభ్యులు సర్వజనాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి అఖండ భజన



సత్యసాయి మహా సమాధి (ఫైల్)

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ శనివారం సాయంత్రం నుంచి అఖండ భజన ప్రారంభం కానుంది. ప్రతి ఏటా అఖండ భజన సత్యసాయి జయంతి వేడుకల ప్రారంభానికి ముందు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అఖండ భజన నిర్వహించేందుకు ప్రశాంతి నిలయంలో ఏర్పాట్లు చేశారు. ఏకకాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి మందిరాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు అఖండ భజనను ప్రారంభించనున్నారు. 24 గంటల పాటు నిర్విఘ్నంగా అఖండ భజన నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మంగళ హారతితో భజన కార్యక్రమం ముగియనుంది.

సీహెచ్‌సీల్లోనూ గుండెకు స్పెషాలిటీ చికిత్స

అనంతపురం మెడికల్: ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా, ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆస్పత్రుల్లో గుండె జబ్బులున్న వారికి స్పెషాలిటీ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏరియా, సీహెచ్‌సీ, తదితర ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్సులకు కార్డియాలజిస్టులు, అనస్తీషియా వైద్యులు స్టెమీ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే నాడు - నేడు కింద ఆస్పత్రులను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, పెద్ద ఎత్తున నూతన పోస్టులను భర్తీ చేసిందన్నారు. తద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. గుండె సమస్య ఉన్నవారు సూపర్‌స్పెషాలిటీ, ప్రభుత్వ సర్వజనాస్పత్రికి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్

రావాల్సి ఉండేదన్నారు. త్వరలో పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో గుండె జబ్బులతో బాధపడేవారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రతి ఆస్పత్రికి డీఫిబ్రిలేటర్, ఈసీజీ 12 ఛానల్ మిషన్, థ్రాంబోలైటిక్ (ఇంజెక్షన్ రూ.50 వేలు) ఖరీదైన సదుపాయాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. అందుకోసం వైద్యులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గుండె సమస్యతో వచ్చిన వారికి ఈసీజీ తీసి, ఆ నివేదికను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని వైద్యులకు ఆన్‌లైన్ ద్వారా పంపడం ద్వారా పరిస్థితికనుగుణంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ కార్డియాలజిస్టులు డాక్టర్ సుభాష్, డాక్టర్ వంశీకృష్ణ (జేఎన్‌టీయూ పాలకమండల సభ్యుడు), డాక్టర్ రాకేష్, డాక్టర్ బాలకిశోర్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్టెమీ శిక్షణ కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ మునీశ్వర్ రెడ్డి, మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ భీమసేనాచార్ తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమిని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. కలెక్టర్‌ను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కలిసి విన్నవించారు. జిల్లాలో 31 మండలాలకు గానూ 28 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, మిగిలిన బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు మండలాలనూ కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. కరువు నేపథ్యంలో వలసల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, ఉపాధి పనిదినాల సంఖ్య 150కు పెంచాలని కోరారు. రాబోవు వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి అవసరాల కోసం అన్ని చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను యుద్ధప్రాతిపదికన నింపాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో నివసిస్తూ అటవీ భూములు సాగుహక్కు కలిగి ఉన్న గిరిజనులు, తండావాసులకు పంట రుణాలు మంజూరు చేయించాలని కోరారు. గిరి భూములు కలిగిన ప్రతి ఒక్కరికీ పంట రుణం, అనుబంధ వ్యవసాయ రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ పథకం కింద పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు (హరిత సభ్యులు) వేతనాలు చెల్లించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.



కలెక్టర్ గౌతమికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

253 మందికి టపాసుల లైసెన్స్



అనంతపురం అర్బన్: జిల్లాలో దీపావళి పండుగను పురస్కరింకొని 253 మందికి టపాసుల విక్రయాల కోసం తాత్కాలిక లైసెన్స్‌ను జిల్లా రెవెన్యూ శాఖ మంజూరు చేసింది. ఈ మొత్తంలో అనంతపురం నగరానికి సంబంధించి 123 మందికి తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేశారు. లైసెన్స్ పత్రాన్ని డీఆర్ఓ గాయత్రిదేవి జారీ చేస్తున్నారు. ప్రస్తుతం మంజూరు చేసిన లైసెన్స్ పూర్తిగా తాత్కాలికమని, దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయాలకు మాత్రమే వర్తిస్తుందని డీఆర్ఓ స్పష్టం చేశారు.

వైద్యుడిపై వరకట్న వేధింపుల కేసు

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్యుడు అభిషేక్ సామ్రాట్‌పై దిశ పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. వివరాలను దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ చిన్నగోవిందు తెలియజేశారు. నగరంలోని రెవెన్యూ కాలనీకి చెందిన సరిత, ప్రభుత్వ వైద్యుడు అభిషేక్ సామ్రాట్ ప్రేమ వివాహం చేసుకున్నారు.అభిషేక్ సామ్రాట్ కొంత కాలంగా డబ్బుపై వ్యామోహంతో భార్యను వేధించడం ప్రారంభించాడు. దీంతో బాధితురాలు దిశ పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ దంపతులకు రెండు సార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా, ఫలితం లేకపోవడంతో సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు వరకట్నం వేధింపుల కింద కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

కుందుర్పి: మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ (26) గ్రామ శివారులోని నాలుగు స్తంభాల మంటపం వద్ద గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కుందుర్పికి చెందిన హనుమంతరాయుడు, చెన్నక్క దంపతుల కుమారుడు శ్రీకాంత్ ఇంటర్ తర్వాత టీటీసీ పూర్తి చేశాడు. ఏడాది కాలంగా ఇంటివద్ద ఉంటూ బేల్దారి పనులకు వెళ్లేవాడు. టీటీసీ పూర్తి చేసి ఇంటి వద్ద ఎందుకుంటావు.. ఏదైనా ఉద్యోగం చూసుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురైన శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.



శ్రీకాంత్ (ఫైల్)

నిందితులు రిమాండ్‌కు తరలింపు

గార్లదిన్నె: హత్య కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ గురుమూర్తి శుక్రవారం తెలిపారు. కోటంకకు చెందిన కోమల అనే యువతిని తల్లి అంజినమ్మ, సోదరుడు కేదార్‌నాథ్ గొంతుకు చున్నీతో బిగించి, హత్య చేశారన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు యువతి తల్లి, అన్నను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు అరవింద్‌నగర్, రహమత్‌నగర్, ఎస్పీ కార్యాలయం, సప్తగిరి సర్కిల్, రామ్‌నగర్, శ్రీనివాస నగర్, రామచంద్రనగర్, చిన్మయనగర్, ఎల్ఐసీ కాలనీ, శారదానగర్, భైరవనగర్, హౌసింగ్‌బోర్డు, ఫెర్రర్‌కాలనీ, సాయినగర్, అశోక్‌నగర్, మిస్సమ్మ కాలనీ, విద్యుత్ నగర్, నాయక్‌నగర్, ఆదర్శనగర్, బుడ్డప్పనగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని, మరోమారు సీఎం చేసుకుందామని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎర్రనేలకొట్టాలలోని రెండో సచివాలయం, వినాయకనగర్‌లోని మూడో సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఆ రెండు సచివాలయాల పరిధిలో అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి బోర్డులను మేయర్, డిప్యూటీ మేయర్లు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, కార్పొరేటర్లు లాలూ, బోయ నాగమణి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి జెండా ఎగుర వేశారు. మేయర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 98.5 శాతం అమలు చేసిన గొప్ప ముఖ్యమంత్రి అన్నారు. 1వ డివిజన్‌లోని 1,2 సచివాలయాలు, వినాయకనగర్‌లోని మూడో సచివాలయ పరిధిలో మొత్తం రూ.80 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కావాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగమణి, సుమతి, లాలూ, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, శ్రీదేవి, కృష్ణవేణి, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు అవైజ్ హాజిరి, హనుమంతు, శోభారాణి, రాధాయాదవ్, భారతి పాల్గొన్నారు.


సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు, పార్టీ నాయకులు

రూ.45.59 కోట్ల సంక్షేమం, అభివృద్ధి: వినాయకనగర్‌లోని 3వ సచివాలయ పరిధిలో రూ.45.59 కోట్లు సంక్షేమం, అభివృద్ధి జరిగింది. వివిధ పథకాల ద్వారా 8067 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా రూ.23.77 కోట్లు, 3309 మందికి పరోక్షంగా రూ.16.05 కోట్లు సంక్షేమాన్ని అందించారు. రూ.5.76 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

2వ సచివాలయంలో రూ.27.74 కోట్లు: ఎర్రనేలకొట్టాల్లోని 2వ సచివాలయ పరిధిలో రూ.27.74 కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగింది. వివిధ పథకాల ద్వారా 5,759 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.17.61 కోట్లు జమ అయ్యింది. 2,120 మందికి పరోక్షంగా రూ.10.12 కోట్లు లబ్ధిచేకూరింది. వీటితో పాటు రూ.2.03 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించారు.

పాలనా వ్యత్యాసాన్ని చూడాలి: ఎర్రనేలకొట్టాల్లోని కొన్ని ఇళ్లను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి సందర్శించి, గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలన మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఎన్ని మార్కులు వేస్తారని ప్రజలను అడగ్గా.. వారు వంద శాతం వేస్తామని ముక్తకంఠంతో చెప్పారు.

అనంతపురం రూరల్: ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం రాత్రి పల్లెనిద్ర చేశారు. శుక్రవారం ఉదయం గడప గడపకూ తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సభ్యులు సంధ్య, హాజీవలి, బళ్లారి నాగేంద్ర, నాయకులు మల్లెల వేణుగోపాల్, రామసుబ్బారెడ్డి, హుస్సేన్, పుల్లారెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో పార్టీ జెండా ఎగురవేసి, సచివాలయ పరిధిలో ప్రజలు ఏ రకంగా సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారో చూపించే బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి , ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ మునివేలు, గొర్రెలు, మేకల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎం.చెర్లోపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


నాగిరెడ్డిపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు సూచించారు. శుక్రవారం నగరంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో జేవీవీ నాయకులు గాంగే నాయక్ అధ్యక్షతన చెకుముకి సంబరాలు-2023 ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ నాగరాజు మాట్లాడుతూ కొన్నేళ్లుగా చెకుముకి సంబరాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ఒకప్పటి ప్రాచీన మానవుడు ప్రకృతిని చూసి భయపడే వాడన్నారు. ప్రస్తుతం సైన్స్ అభివృద్ధి చెందిన తర్వాత అందులోని రహస్యాలను చేదించాడన్నారు. కార్యక్రమంలో జేవీవీ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, సీనియర్ నాయకులు డాక్టర్ వీరభద్రయ్య, స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, జేవీవీ నాయకులు రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, నూర్, ప్రసాద్, ప్రసాద్ రెడ్డి, నవీన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ, జేవీవీ నాయకులు

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

అనంతపురం: జీవితంలో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ అన్నారు. ఓటీపీఆర్ఐలో రెండు రోజులుగా నిర్వహించిన ఇంట్రా కాలేజ్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ఆర్జీయూకేటీ ఇన్‌చార్జ్ వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అకడమిక్‌తో పాటు క్రీడల్లోనూ రాణించడానికి ఇలాంటి వేదికలు దోహదపడతాయన్నారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్/ జేఎన్‌టీయూ అనంతపురం పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ బి.జోజిరెడ్డి పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎం.విజయకుమార్

మృతుడి కుటుంబానికి సర్కారు అండ


మృతుని కుటుంబ సభ్యురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


బాలపోతన్నకు ధైర్యం చెబుతున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రాజమ్మ కాలనీకి చెందిన సాకే ఈశ్వరయ్య (32) గతేడాది సెప్టెంబర్ 13న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందులో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అనంత తన నివాసంలో మృతుడి కుటుంబ సభ్యులకు అదజేశారు. కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ వై లక్ష్మీదేవి, వెల్ఫేర్ కార్యదర్శి వై లక్ష్మీదేవి, నాయకులు తిరుపాల్‌రెడ్డి, మార్కెట్ ఖాజా, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన కొంకుల శివారెడ్డి కొన్ని నెలల క్రితం ఆత్మకూరు బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అప్పట్లోనే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే శివారెడ్డి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు శివారెడ్డి భార్య స్వరూపారాణికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు రూ. 2 లక్షల ఆర్థికసాయం చేశారు.

బాధితులకు పరామర్శ

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న తండ్రి జొన్నగిరి నారాయణప్ప శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పి. యాలేరు సొసైటీ ప్రెసిడెంట్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి.. నారాయణప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలపోతన్నకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. అలాగే మండలంలోని సింగంపల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్ (50) అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారి ప్రతినిధి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి... భాస్కర్‌నాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్‌నాయక్, నీలిమ, మాజీ జెడ్పీటీసీ మధు, తదితరులున్నారు.

వ్యర్థాలతో కళాకృతులు

అనంతపురం: పర్యావరణంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా స్పెయిన్‌లోని బాలేరిక్ దీవులకు చెందిన 24 మంది కళాకారులు ఆర్డీటీలో ఏర్పాటు చేసిన వ్యర్థాల కేంద్రం నుంచి వ్యర్థ పదార్థాలను సేకరించి వాటితో కళాఖండాలను సృష్టించారు. అనంతపురం, బుక్కరాయసముద్రం, బత్తలపల్లి సహా వివిధ ప్రాంతాల్లో గోడలపై చిత్రాలు గీయడం, కళాకృతులను రూపొందించి అవగాహన కల్పించడం, కళాకృతులను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కృషి చేశారు. కళాఖండాలు కాలుష్యం, ప్రకృతి, పర్యావరణంపై అవగహన కల్పిస్తాయని ఆర్డీటీ మనభూమి కోఆర్డినేటర్ షమీమ్ భాను అన్నారు.


కళాఖండాలు రూపకల్పన చేసిన స్పెయిన్ దేశస్తులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చెన్నేకొత్తపల్లి: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారని మండల ప్రజా ప్రతినిధులు, రైతులు తెలియజేశారు. శుక్రవారం ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి సుచరిత మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటారని, పంటల సాగుకు సంబంధించి ఏ అనుమానం వచ్చినా రైతులు నివృత్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం రైతు భరోసా నిధులు విడుదలైన సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసిహారెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

రక్షణ శాఖకు విరాళాల సేకరణలో వైద్య కళాశాల ప్రథమం

అనంతపురం మెడికల్: భారత రక్షణ మంత్రిత్వ శాఖకు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల దేశంలోనే అధిక మొత్తంలో విరాళాన్ని అందించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఘర్షణలు, ఉగ్రవాదుల దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలబాలికలకు విద్య, వైద్యాన్ని అందించేందుకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఏటా విరాళాలు సేకరిస్తోంది. ఇందులో భాగంగా గతేడాది అనంతపురం వైద్య కళాశాల అధ్యాపకులు, మెడికోలు, పీజీలు, వైద్య విద్యార్థులు, సర్వజనాస్పత్రి వైద్యులు, స్టాఫ్‌నర్సులు రూ.2,03,553 విరాళం అందించారు. విరాళాల సేకరణలో కీలకంగా వ్యవహరించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు బృందాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు శుక్రవారం అభినందించారు.

సంక్షిప్త సమాచారం

ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఒకటో డివిజన్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మేయర్ వసీం పరిశీలించారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులు ఉన్నారు.

దీపాలు వెలిగించండి

అనంతపురం ఎడ్యుకేషన్: దీపావళి పండుగ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగుతల్లి విగ్రహం వరకు సాగింది. కళాశాల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ దీపావళి అందరి జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. పండుగరోజు టపాసులకు బదులుగా దీపాలు వెలిగించాలన్నారు. టపాకాయలు కాల్చడంవల్ల వివిధ రకాల వాయువులు వెలువడుతాయని, దీనిద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదనరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.ఆనంద్‌బాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

15న సీపీఎం బహిరంగ సభ

అనంతపురం అర్బన్: అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ సీపీఎం ముద్రించిన పుస్తకాలను శుక్రవారం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం పునర్విభజన జరిగి పదేళ్లు పూర్తవుతున్నా ప్రాంతాల వెనుకబాటు, సామాజిక అసమానతలు అలాగే కొనసాగుతున్నాయన్నారు.

ముగిసిన ఎఫ్ఎల్‌సీ, మాక్ పోల్

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఈవీఎంలు ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ), మాక్ పోల్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోడౌన్‌లో ఈవీఎంలను భద్రపరిచిన గదిని ఎన్నికల విభాగం డీటీ కనకరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సిబ్బంది సీజ్ చేశారు.



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్-19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6-3తో గెలిచి, రెండో సెట్‌లో 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రవాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.



రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు

దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021-జూన్), ఎజాజ్ పటేల్ (2021-డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా


డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆ్రస్టేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మానుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.


ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244.** వికెట్ల పతనం: 1-41, 2-41, 3-45, 4-94, 5-112, 6-116, 7-160, 8-204, 9-226, 10-244. బౌలింగ్: రబడ 10-0-40-0, ఎన్‌గిడి 8.3-0-69-2, మార్క్‌రమ్ 4.3-0-25-0, కొయెట్జీ 10-1-44-4, కేశవ్ మహరాజ్ 10-1-25-2, ఫెలుక్‌వాయో 7-0-36-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1-64, 2-66, 3-116, 4-139, 5-182. **బౌలింగ్:** ముజీబ్ 10-0-51-1, నవీనుల్ 6.3-0-52-0, నబీ 10-1-35-2, ఒమర్జాయ్ 1-0-8-0, రషీద్ ఖాన్ 10-1-37-2, నూర్ అహ్మద్ 9-0-49-0, రహ్మత్ షా 1-0-12-0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ X పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి-ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్-ప్రబీర్ జోడీ 2-6, 3-6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా-అర్ణవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.


సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్డె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-1, 7-11, 19-17, 8-11, 11-6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ


● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ- ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్


● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ -''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.


● కాజల్

వేటాడే సత్యభామ

'**స**త్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక


● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''**మా** పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ- ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎడురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!


● రాహుల్, శివానీ, మిధున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం


● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ- ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.


● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...


● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్- కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్


● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్




''**అ**లా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ-''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.9°/17.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం పెరిగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: అయ్యప్ప మాలధారుల కోసం అనంతపురం జిల్లా మీదుగా కేరళలోని శబరిమలకు సికింద్రాబాద్-కొల్లాం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు ప్రతి శుక్రవారం సికింద్రాబాద్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు రైలు (07127) బయలుదేరి శనివారం రాత్రి 7.30 గంటలకు కొల్లం చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు (07128) కొల్లం జంక్షన్ నుంచి శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని తెలిపారు. ఫస్ట్ క్లాస్ ఏసీ, టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్‌తోపాటు సెకండ్ క్లాస్ జనరల్ బోగీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కొండచిలువను చంపిన గ్రామస్తులు



కొండచిలువ, కుందేలు కళేబరాలు

పుట్లూరు: గ్రామస్తుల చేతిలో కొండచిలువ హతమైంది. గరుగుచింతలపల్లి సమీపంలో సోమవారం ఏడు అడుగుల పొడవున్న కొండచిలువ గ్రామస్తులకు కనిపించింది. అప్పటికే కుందేలును చంపి మింగుతోంది. ఇది గ్రామంలోకి ప్రవేశిస్తే ప్రమాదమని భావించిన గ్రామస్తులు కొండ చిలువను కొట్టి చంపేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ పీడీ తరుణ్

తాడిపత్రి టౌన్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నేషనల్ హైవే పీడీ తరుణ్ కాంట్రాక్టర్లకు సూచించారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులో జరుగుతున్న నేషనల్ హైవే 544డీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి నాణ్యమైన మట్టి ఉపయోగించాలన్నారు. మట్టి రోడ్డు రోలింగ్ పనులు ప్రతి లేయర్ పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు.

అక్కనపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

అక్కనపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఆలూరు రామేశ్వరరెడ్డి, ప్రతాప్, సూర్యముని ఎన్‌హెచ్ పీడీని కోరారు. నేషనల్ హైవే కారణంగా గ్రామానికి వెళ్లాల్సిన రహదారిని కోల్పోతున్నామని, దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. హైవే మీదుగా గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరారు. ఇందుకు పీడీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మెగా ఇంజినీరింగ్ సంస్థ జీఎం రవిశంకర్ పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓల నియామకం



శ్రీనివాసరావు



శ్రీదేవి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ అనంతపురం డివిజన్, గుత్తి డివిజన్లకు కొత్త ఉప విద్యాశాఖ అధికారుల (డిప్యూటీ డీఈఓ)ను నియమించారు. అనంతపురం డివిజన్ డీవైఈఓగా విడపనకల్లు ఎంఈఓ-1 బి.శ్రీనివాసరావు, గుత్తి డివిజన్ డీవైఈఓగా పెద్దపప్పూరు ఎంఈఓ-1 హెచ్.శ్రీదేవిని నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అనంతపురం డీవైఈఓగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఎంఈఓ-1 వి.పద్మప్రియ, గుత్తి డీవైఈఓగా నంద్యాల జిల్లా శిరివెళ్ల ఎంఈఓ-1 శంకరప్రసాద్ పని చేస్తుండేవారు. వీరిద్దరూ ఇతర జిల్లాల్లో రెగ్యులర్ ఎంఈఓలుగా ఉంటూ ఇక్కడ ఇన్‌చార్జ్ డీవైఈఓలుగా పని చేయడం ఇబ్బందిగా ఉందంటూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా విన్నవించారు. దీంతో వారిని ఇన్‌చార్జ్‌లుగా తప్పించి కొత్తగా ఇదే జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎంఈఓలకు డీవైఈఓలుగా ఎఫ్‌ఏసీ బాధ్యతలను అప్పగించారు.

నయా చీటింగ్

- పెచ్చుమీరుతున్న ఆర్థిక మోసాలు
- చిట్టీల పేరుతో కుచ్చుటోపీ
- ఉద్యోగుల నుంచి సామాన్యుల దాకా సమిధలు

కుటుంబ అవసరాలు, పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలనుకున్న వారు చిట్‌ఫండ్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద నమ్మకంతో చిట్ వేస్తున్నారు. అయితే డిపాజిట్ సొమ్మును కొందరు వ్యక్తులు, సంస్థల నిర్వాహకులు తమ వ్యక్తిగత ఆస్తులు పెంచుకునేందుకు, జల్సాలు తీర్చుకునేందుకు మళ్లించేస్తున్నారు. వ్యవధి దాటినా డబ్బు తిరిగిరాక పోయేసరికి నిలువునా మోసపోయామని తెలిసి బాధితులు కుంగిపోతున్నారు. ఈ నయవంచకుల చేతిలో ఎక్కువగా సమిధలవుతోంది ఉద్యోగులు, సామాన్యులే.



గడిచిన మూడేళ్లలో జిల్లాలో జరిగిన చిట్, ఆర్థిక మోసాలు..

సంస్థ	ఐపీ పెట్టిన సొమ్ము
ఈ- బిడ్	రూ.200 కోట్లు
ఆదరణ చిట్‌ఫండ్	రూ.60 కోట్లు
జయలక్ష్మి (చిట్స్)	రూ.20 కోట్లు
నజీర్, కానిస్టేబుల్ (చిట్టీలు)	రూ.10 కోట్లు
రమేష్ టీచర్ (చిట్టీలు)	రూ.5 కోట్లు
రాయదుర్గం టీచర్ (చిట్టీలు)	రూ. కోటి
ఇతరత్రా సంస్థలు/వ్యక్తులు	రూ.50 కోట్ల పైనే

- సునీల్ అనే ఓ మెడికల్ రెప్‌కు ఈ-బిడ్ ఏజెంటు అధిక డబ్బు వస్తుందని ఎర చూపాడు. దీంతో సునీల్ దాచుకున్న డబ్బు రూ.48 లక్షలు ఈ-బిడ్‌లో కట్టాడు. మూణ్నెళ్లు తిరక్కుండానే సంస్థ బోర్డు తిప్పేసింది. సునీల్‌కు ఇద్దరు చిన్నారులున్నారు. కుటుంబం వీధిన పడింది.
- అనంతపురంలో పేరుమోసిన జనరల్ సర్జన్ ఆయన. ప్రభుత్వ వైద్యుడిగా రిటైర్ అయ్యారు. శేషజీవితంలో క్లినిక్ నడుపుకుంటున్న ఆయనకు ఆదరణ చిట్స్ నిర్వాహకులు విల్లా (బంగ్లా) ఆశ చూపారు. రాప్తాడు మండలం హంపాపురం దగ్గర ఓపెన్ విల్లా చూసిన ఆయన ఆకర్షితులై రూ.25 లక్షలు డిపాజిట్ చేశారు. అంతే..డబ్బు పోయింది కానీ విల్లా రాలేదు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం : రూపాయి రూపాయి కూడబెట్టి మూటగట్టిన సామాన్యుల సొమ్మును మోసగాళ్లు గద్దల్లా తన్నుకుపోతున్నారు. వడ్డీ రూపంలో అదనంగా ఇస్తామనో, డిపాజిట్ చేస్తే రెండు రెట్లు అధికంగా వస్తుందనో ఆశ చూపి వందల కోట్ల రూపాయలు ముంచిన ఘటనలు జిల్లాలో చాలామందిని కోలుకోలేకుండా చేశాయి. ఇల్లు కట్టుకుందామని, పిల్లలకు పెళ్లి చేద్దామని, పిల్లల పై చదువులకని ఎంతో ఆశగా కట్టిన డబ్బులు ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలు, చిట్టీలు వేసే వ్యాపారులు, గొలుసుకట్టు సంస్థల నిర్వాహకులు స్వాహా చేసి నిండా ముంచారు. సంపాదించిన డబ్బు జల్సారాయుళ్ల పాలు కావడంతో బాధిత కుటుంబాలు బోరున విలపిస్తున్నాయి.

కోలుకోలేని దెబ్బతీసిన ఈ-బిడ్

ఈ-బిడ్ సంస్థకు ఊరూ పేరూ ఏమీ లేదు. ఒక బోర్డు తగిలించి లక్ష కడితే నెలకు రూ.30వేలు ఇస్తామని ప్రచారం చేశారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలోమని ఎగబడి మరీ కట్టారు. ఆ సంస్థ ఊరూరా ఏజెంట్లను నియమించి మరీ కట్టించుకుంది. ఉన్నట్టుండి ఒకరోజు అర్ధరాత్రి బోర్డు తిప్పేసింది. దీంతో వేలాదిమంది వీధిన పడ్డారు. దాదాపు రూ.200 కోట్లు ముంచారు. ఈ-బిడ్ సంస్థ కేసులో నిందితుడైన సునీల్ జైల్లో ఉన్నాడు. బెయిలొచ్చినా బయటకు రావడం లేదని సమాచారం. ఆత్యాశకు పోయిన పలువురు టీచర్లు, పోలీసులు కూడా ఈ-బిడ్‌లో డబ్బు కట్టి విలవిలలాడుతున్నారు.

ఆదరణ పేరుతో దారుణంగా..

ఆదరణ చిట్స్ అంటే అనంతపురంలో తెలియని వారుండరు. పెద్ద పెద్ద విల్లాలు, ప్లాట్లు చూపించి ఆశలు రేపడంతో చాలామంది చిట్‌లు కట్టడం, ఆ డబ్బును అక్కడే డిపాజిట్ చేయడం, దానికి వచ్చే వడ్డీని మళ్లీ చిట్ వేయడం చేశారు. చిట్స్ యాజమాన్యం తమ వినియోగదారులను నిలువునా మోసం చేసింది. సుమారు రూ.60 కోట్లకు ఐపీ పెట్టింది. చిట్ యజమానులు అనంతపురం సెంట్రల్ జైల్లో ఉన్నారు. బాధితులు మాత్రం డబ్బు పోగొట్టుకుని వేదన చెందుతున్నారు.

కొంపముంచుతున్న చిట్‌ల వ్యాపారం

జిల్లాలో జయలక్ష్మిని ఎవరూ మర్చిపోరు. ఖరీదైన చీరలు కట్టేది. నగలు నట్రా చాలా డాబుగా ఉండేది. విలాసవంతమైన కార్యాలయం చూసి ఆమె వద్ద వందలాది మంది చిట్ వేశారు. వచ్చిన సొమ్మును భద్రపరుచుకున్న జయలక్ష్మి ఉన్నట్టుండి లగేజీ సర్దుకుని వెళ్తుంటే ఎస్‌కే యూనివర్సిటీ దగ్గర చిట్ సభ్యులు పట్టుకున్నారు. అయితే అప్పటికే ఆమె సుమారు రూ.20 కోట్లకు ఐపీ పెట్టేసింది. ఈ కేసులో జైలుకెళ్లి బెయిలుపై బయటికొచ్చింది. బాధితులు మాత్రం లబోదిబోమంటున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చిట్టీలను నమ్మొద్దు



రిజిస్ట్రేషన్ గానీ, అధికారిక లైసెన్సు గానీ లేకుండా చిట్స్ నడిపే సంస్థలు, కార్యాలయాలు, ప్రైవేట్ వ్యక్తులను నమ్మకండి. ఎక్కువ డబ్బు వస్తుందని ఆశ పడి చిట్టీలు కడితే అసలుకే మోసం వస్తుంది. మీకు నమ్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకులు, పోస్టాఫీసులు వంటివాటిల్లో డబ్బును భద్రపరుచుకోండి. అనధికారిక చిట్టీలు వేసే వ్యక్తులు, సంస్థల గురించి సమాచారం ఇస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– అన్బురాజన్, ఎస్పీ, అనంతపురం

మొన్న టీచర్ రమేష్ చేసిన దురాగతమూ ఇదే. చిట్టీల పేరుతో రూ.5 కోట్లకు టోపీ పెట్టారు. నిన్న రాయదుర్గం నియోజకవర్గంలో పనిచేసే ఉపాధ్యాయుడు చేసిన పాపమూ ఇదే. చిట్టీల పేరుతో బాధితులను నిండా ముంచారు. మోసం చేస్తే కేసు పెడతారు... నాలుగురోజులు జైల్లో ఉండి బెయిల్‌మీద బయటకు రావచ్చులే అనే ధీమాతో ఈ మోసాలకు తెగబడుతున్నారు.

రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 23న సత్యసాయి జయంతి సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 22న పుట్టపర్తిలో పర్యటిస్తారన్నారు. ఆ రోజు వాయుసేన విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకుని.. అక్కడి నుంచి ప్రశాంతి నిలయం వెళ్తారన్నారు. రోడ్డు మార్గంలో ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రపతి సభావేదిక అయిన సాయిహీరా కన్వెన్షన్ హాలు వద్ద భద్రతా లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ సత్యసాయి జయంత్యుత్సవాలు ముగిసే వరకూ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీలు అమ్మిరెడ్డి, రవి ప్రకాశ్, ఎస్పీ మాధవరెడ్డి, అనంతపురం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు విమానాశ్రయం, ప్రశాంతి నిలయం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 437 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఒక్క అర్జీ కూడా రీ-ఓపెన్ కాకూడదన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు. అదే క్రమంలో అర్జీదారునికి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

- ఉప్పరపల్లి పొలం సర్వేనంబరు 107/1 నుంచి 7 వరకు గల ప్రభుత్వ భూమిలో ఒకటిన్నర సెంటు చొప్పున 69 మందికి 2011 సంవత్సరంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, నిర్మాణాలు చేపట్టేందుకు వెళ్లిన ప్రతిసారీ ఎవరో ఒకరు అడ్డు తగిలి ఇబ్బంది పెడుతున్నారని అంగన్‌వాడీ వర్కర్లు నక్షత్ర, తదితరులు అర్జీ సమర్పించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.
- తమకు 1988లో సర్వేనంబరు 337-8లో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే ఇప్పుడు ఇద్దరు వ్యక్తులు ఆ భూమిని కబ్జా చేశారని, వారి నుంచి తమ పొలం ఇప్పించాలని అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన నాగలక్ష్మి విన్నవించింది.

రోజూ 65 వేల మంది కూలీలకు 'ఉపాధి'

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రోజూ 65 వేల మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ, కులగణన, జగనన్న ఆరోగ్య సురక్ష, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి మండల, డివిజన్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి పనులు మరింత ఎక్కువ మందికి కల్పించాలన్నారు. జిల్లాలో 2.60 లక్షల కుటుంబాలలో 4.65 లక్షల మంది కూలీలు ఉన్నారన్నారు. అందరికీ 100 రోజులు పని కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో కులగణన సర్వే ఈ నెల 27వ తేదీ నుంచి పక్కాగా నిర్వహించాలని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా ఎంత మందికి లబ్ధి చేకూరిందనే వివరాలను సిద్ధం చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

మార్కుల మెమోలు ఇవ్వడం లేదని ఫిర్యాదు



బాధిత విద్యార్థులు

డీఈడీ కోర్సు పూర్తయిన తమకు మార్కుల మెమో ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని విద్యార్థులు మెహద్ నవాజ్, సౌమ్య, నీలావతి, మెహర్ తదితరులు 'స్పందన'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని విజయభారతి డైట్ కళాశాలలో 2020-2022 బ్యాచ్‌లో 63 మంది డీఈడీ పూర్తి చేశారన్నారు. తాము కళాశాలకు సంబంధించిన అన్ని ఫీజులూ చెల్లించేశామన్నారు. ఈ ఏడాది అక్టోబరు పదో తేదీన బుక్కరాయసముద్రం పోస్టాఫీసుకు మార్కుల మెమోలు వచ్చాయన్నారు. తాము అక్కడికి వెళ్లి అడిగితే కళాశాల సిబ్బంది ఒకరు వచ్చి అన్నింటినీ తీసుకెళ్లారని చెప్పారన్నారు. కళాశాలలో సంప్రదిస్తే ఒక్కొక్కరు రూ.35వేలు కడితేనే మార్కుల మెమో ఇస్తామని కరాఖండిగా చెప్పారన్నారు. తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులను పిలిపించి కళాశాలకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించి మార్కుల మెమో ఇప్పించాలని ఆదేశించారు.

ఆంధ్ర- తమిళనాడు మ్యాచ్ డ్రా

అనంతపురం: బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 (మెన్) క్రికెట్ టోర్నీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ మైదానంలో ఆంధ్రప్రదేశ్- తమిళనాడు జట్ల మధ్య నిర్వహించిన నాలుగు రోజుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగులు చేయగా, ఆంధ్ర 318 పరుగులకే ఆలౌట్ అయింది. తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తర్వాత ఆంధ్ర మ్యాచ్ ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా తమిళనాడుకు మూడు పాయింట్లు దక్కాయి. ఆంధ్ర జట్టు ఒక పాయింట్‌తో సరిపెట్టుకుంది.

ట్రెజరీ విశ్రాంత అధికారి ఇంట్లో చోరీ



చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

- బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు అపహరణ

గుంతకల్లు రూరల్: ట్రెజరీ విశ్రాంత అధికారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అర కిలో బంగారు, రెండున్నర కిలోల వెండి వస్తువులతో పాటు నగదు అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. విశ్రాంత అసిస్టెంట్ ట్రెజరీ అధికారి రామభూషణ్ రాజు గుంతకల్లు పట్టణంలోని కసాపురం రోడ్డు సమీపాన అంజలీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు. వీరిలో ఓ కుమారుడు, కోడలు పుట్టపర్తిలో ఉంటున్నారు. మరో కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. మనవరాలిని చూసుకునేందుకని రెండువారాల కిందట రామభూషణ్‌రాజు భార్య పుట్టపర్తికి వెళ్లింది. అప్పటి నుంచి విశ్రాంత ఉద్యోగి ఒకరే ఇంట్లో ఉండేవారు. వారం కిందట ఆయన కూడా పుట్టపర్తికి వెళ్లారు. పని మనిషి మాత్రం రెండు రోజులకోసారి వచ్చి పక్కింటి వారి వద్దనుంచి తాళం చెవి తీసుకుని గేటు తీసి.. కాంపౌండ్ పరిసరాలు శుభ్రం చేసి వెళ్లేది. రోజుల తరబడి ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పథకం వేశారు. గ్రిల్ తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి, ఆ తరువాత చెక్క తలుపు తాళం కొండీని విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి అందిన కాడికి ఎత్తుకుపోయారు. సోమవారం ఉదయం శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చింది. అయితే అప్పటికే ఇంటి తలుపు తెరిచి ఉండటంతో వెంటనే పక్కింటి వారికి, ఇంటి యజమానికి సమాచారమందించింది. పుట్టపర్తి నుంచి రామభూషణ్‌రాజు హుటాహుటిన బయల్దేరి గుంతకల్లుకు చేరుకున్నారు. ఇంట్లోకెళ్లి చూడగా రెండు బెడ్‌రూముల్లోని బీరువాలు, అల్మారాల్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటం చూసి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, కసాపురం ఎస్‌ఐ గోపాలుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 55 తులాల బంగారంతో పాటు 2.5 కిలోల వెండి వస్తువులు, రూ.62 వేలు చోరీ అయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతపురం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సభ్యులు ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు.

● పరమేశ్వరా ప్రణమామ్యహం



పూజలందుకున్న కాశీ విశ్వేశ్వరుడు





హెచ్చెల్సీ వద్ద శివాలయంలో పూజలు చేయిస్తున్న భక్తులు, అనంతపురం మొదటిరోడ్డు శివాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసంలో వచ్చిన తొలి సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా అంతటా ప్రధాన శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, బిల్వ, మారేడు పత్రాలతో అభిషేకాలు, అలంకార సేవలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. దీపాల వెలుగులో ఆలయాలు శోభను సంతరించుకున్నాయి.

– అనంతపురం కల్చరల్: